క్లుప్తంగా

చంద్రబాబు, మనోహర్ వల్లే పవన్‌కు ఇబ్బందులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: వెన్నుపోట్లు, కుట్ర రాజకీయాలు వైఎస్సార్ సీపీకి తెలియవని, వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న చంద్రబాబు, మనోహర్ వల్లే పవన్ కల్యాణ్‌కు ఇబ్బందులని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు వెనుకుండి ఆడిస్తేనే వలంటీర్ల గురించి పవన్ కల్యాణ్ చెడుగా మాట్లాడుతున్నారని అన్నారు. వలంటీర్లు ఎక్కడన్నా ఎవరినన్నా ట్రాప్ చేసి ఒంటరి మహిళలను అమ్మిన ఘటనలు ఉంటే రుజువు చేయాలన్నారు. చంద్రబాబు, నాదెళ్ల మనోహర్ వల్లనే మీకు ఇబ్బందులని అన్నారు. ఒకరేమో ఎన్‌టీఆర్‌ని వెన్నుపోటు పొడిచి గద్దె దింపిన నాదెళ్ల భాస్కరరావు కుమారుడు మనోహర్ అయితే, మరొకరు ఎన్‌టీఆర్‌ని లేకుండా చేసిన చంద్రబాబు అని, వీరిద్దరిని అర్థం చేసుకుని రాజకీయాల్లో మెలగాలని పవన్ కల్యాణ్‌కు సూచించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం బసవయ్య, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్స్ ఆక్సీమీటర్ల పంపిణీ

కోడూరు: రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పల్స్ ఆక్సీ మీటర్లను గురువారం పంపిణీ చేశారు. కోడూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పది సెంటర్లకు వీటిని అందించారు. సెంటర్ల పరిధిలోని బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారుల ఆరోగ్య వివరాలు తెలుసుకొనేందుకు ఈ పల్స్ ఆక్సీమీటర్లను ఉపయోగిస్తామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మన్ వేజండ్ల శ్రీనివాసరావు, సభ్యులు తోట శ్రీనివాసరావు, రేపల్లె యోగప్రకాష్, గోనా వేణు, జొన్నా రవిశంకర్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల మంజూరు

నాగాయలంక: నాగాయలంక మండలం ఎదురుమొండి గ్రామంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరయ్యాయని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయం ప్రతినిధులు గురువారం తెలిపారు. ఎంపీ చొరవతో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్‌ఈసీ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) కింద ఈ నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ఈ భవనానికి త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

వృద్ధుడి కార్నియాల సేకరణ

నాగాయలంక: గ్రామంలోని 3వ వార్డుకు చెందిన ఉప్పల వెంకటేశ్వరరావు (79) అనారోగ్యంతో మృతిచెందారు. అతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ తాడిగడపలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి గురువారం దానం చేశారు. ఆయన భార్య శివపార్వతి, కుమారులు శ్యామ్ ప్రసాద్, శ్రీనివాసరావు ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకువచ్చారు. మండల నేత్రదాన మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణ సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

నవగ్రహ ఆరాధన, హోమాలు

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు రెండో రోజు గురువారం జరిగాయి. నవ గ్రహారాధన, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్ఎస్ చక్రధరరావు, చైర్మన్ ముత్తేవి రవికాంత్, డైరెక్టర్లు పర్యవేక్షించారు.

సీతమ్మకు ఆషాఢ సారె

మచిలీపట్నంటౌన్: బలరామునిపేటలోని కోదండ రామాలయంలో భక్తులు సీతమ్మకు ఆషాఢ సారెను సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

మోపిదేవి ఎంఈఓ, ఉపాధ్యాయుడు సస్పెన్షన్

మోపిదేవి: ఎంఈఓ కె. రాజ్‌కుమార్, ఉపాధ్యాయుడు కె. ఉమామహేశ్వరరావును సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి ఎంఈఓగా స్థానిక ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. దుర్గాసాగర్‌ను నియమించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సురేంద్ర

లక్ష్మీపురం(చల్లపల్లి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చల్లపల్లి మండల నూతన అధ్యక్షుడిగా లక్ష్మీపురం పంచాయతీ రామానగరం గ్రామానికి చెందిన కొల్లూరి సురేంద్ర నియమితులయ్యారు. చల్లపల్లి పంచాయతీ పార్కులో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో సురేంద్రను నియమించారు.

మెరైన్ పోలీసుల మాక్‌డ్రిల్

కోనేరుసెంటర్: తీర ప్రాంత రక్షణలో భాగంగా గిలకలదిండి మెరైన్ పోలీసులు గురువారం మచిలీపట్నంలో సాగర్ కవచ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మెరైన్ సీఐ శ్యామ్ ఆధ్వర్యంలో మెరైన్ సిబ్బంది తీర ప్రాంత గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, బెల్ కంపెనీ ప్రాంతాలలో బందోబస్తు నిర్వహించారు. మెరైన్ సీఐ శ్యామ్ మాట్లాడుతూ సముద్ర మార్గం గుండా ఉగ్రవాద శక్తులు తీర ప్రాంత గ్రామాల్లోకి ప్రవేశించకుండా మెరైన్ టీంలు పని చేస్తున్నాయని వివరించారు.

ఘనంగా డెప్యూటీ మేయర్ల ప్రమాణ స్వీకారం

పాల్గొన్న ఎమ్మెల్యే పేర్ని నాని, జేసీ అపరాజితసింగ్



డెప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న విజయలక్ష్మి



డెప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శీలం భారతి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ నూతన డెప్యూటీ మేయర్లుగా మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి నాగ కుసుమరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డెప్యూటీ మేయర్ల ఎన్నిక గురువారం మునిసిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, డెప్యూటీ మేయర్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అపరాజితసింగ్ నిర్వహించారు. 26వ డివిజన్ కార్పొరేటర్ మాడపాటి విజయలక్ష్మి పేరును డెప్యూటీ మేయర్‌గా 14వ డివిజన్ కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించగా 18వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకట సుధాకర్‌బాబు బలపరిచారు. అలాగే 3వ డివిజన్ కార్పొరేటర్ శీలం భారతి పేరును 25వ డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ ప్రతిపాదించగా 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్‌అస్గర్‌అలీ బలపరిచారు. వైఎస్సార్ సీపీకి చెందిన సభ్యులందరూ మద్దతు తెలపడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది. డెప్యూటీ మేయర్లుగా వీరిరువురు ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను వారికి జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే పేర్ని నాని అభినందన

నూతనంగా ఎన్నికైన డెప్యూటీ మేయర్లకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకగ్రీవంగా నాగకుమారి ఎన్నిక



పెడన మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్డీఓ కిషోర్, మంత్రి జోగి రమేష్

పెడన: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏడో వార్డు కౌన్సిలర్ కటకం నాగకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మచిలీపట్నం ఆర్డీఓ, ఎన్నికల అధికారి ఐ. కిషోర్ గురువారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. పెడన ఎమ్మెల్యే, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా ఏడో వార్డు కౌన్సిలర్ కటకం నాగకుమారి పేరును రెండో వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి ప్రతిపాదించారు. 19వ వార్డు కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్ బలపరిచారు. నాగకుమారిని ఏకగ్రీవంగా ఎన్నికచేస్తూ ప్రమాణ స్వీకారం చేయించారు. నాగకుమారి భర్త 8వ వార్డు కౌన్సిలర్ కటకం బాబు దుర్గ వీర వెంకట ప్రసాద్ (కటకం ప్రసాద్) దంపతులను మంత్రి జోగి రమేష్, ఎన్నికల అధికారి కిషోర్ సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు, బంధువులు, నాయకులు నాగకుమారి దంపతులకు అభినందనలు తెలిపారు.

పదవికి వన్నె తేవాలి ..

నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ నాగకుమారి మంచి సేవలు అందించి పదవికి వన్నె తేవాలని మంత్రి జోగి రమేష్ సూచించారు. పెడన పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. తొలుత నాగకుమారి ఏడో వార్డు నుంచి భారీ ర్యాలీగా గూడూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి మంత్రి జోగి రమేష్‌తో కలిసి కటకం ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు పాదయాత్ర చేస్తూ ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. భారీ గజమాలతో మంత్రి జోగి రమేష్‌తో పాటు కటకం ప్రసాద్, నాగకుమారి దంపతులను నాయకులు సన్మానించారు.

మచిలీపట్నం మేయర్ వెంకటేశ్వరమ్మ రాజీనామా



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మేయర్ పదవికి రాజీనామా చేశారు. డెప్యూటీ మేయర్ల ఎన్నిక అనంతరం కౌన్సిల్‌హాల్‌లో మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. ఏడు అంశాలతో ఉన్న అజెండా ఆమోదం పొందిన అనంతరం ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామా లేఖను కమిషనర్ జి. చంద్రయ్యకు అందజేశారు. వెంకటేశ్వరమ్మ రాజీనామాను కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే పేర్ని నాని, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు అందించిన సహకారం ఎన్నటికీ మరిచిపోలేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పేర్ని నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ నా జీవితాంతం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ కుటుంబానికి రుణపడి ఉంటానన్నారు. తన తండ్రి పేర్ని కృష్ణమూర్తి కాలం నుంచి వెంకటేశ్వరమ్మ మామయ్య రామయ్యతో పాటు ఆమె భర్త మోకా భాస్కరరావు కుటుంబం తమ కుటుంబంతో కలిసి నడుస్తున్నారని చెప్పారు. మేయర్‌గా రెండేళ్లకు పైగా ఆమె నిబద్ధతతో పనిచేశారన్నారు. కొడుకును, భర్తను కోల్పోయిన వెంకటేశ్వరమ్మకు తానే కొడుకుగా జీవితాంతం ఉంటానని చెప్పారు. తన వెన్నంటి నడుస్తున్న కార్పొరేటర్లకు, పార్టీ కార్యకర్తలకు తానెప్పుడూ రుణపడి ఉంటానన్నారు. రాజీనామా చేసిన మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబుతో తమకు ఉన్న అనుబంధాలను పలువురు కార్పొరేటర్లు వివరించారు.

మేయర్‌గా చిటికిన..

నూతన మేయర్‌గా 43వ డివిజన్ కార్పొరేటర్ చిటికిన వెంకటేశ్వరమ్మను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రకటించారు. మోకా వెంకటేశ్వరమ్మ రాజీనామా అనంతరం పేర్ని నాని మాట్లాడుతూ చిటికిన వెంకటేశ్వరమ్మ పేరును మేయర్‌గా ఖరారు చేశామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే కుదిరిన ఒప్పందంలో భాగంగా ప్రస్తుతం నూతన డెప్యూటీ మేయర్ల ప్రమాణ స్వీకారం పూర్తయిందని, కొద్ది రోజుల్లోనే మేయర్‌గా చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు.

పవన్ కల్యాణ్ చిత్రపటం దహనం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం తెలుగురావుపాలెం సచివాలయం పరిధిలోని వలంటీర్లు గురువారం పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని దహనం చేశారు. వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలుగురావుపాలెం, అచ్చెంపాలెంకు చెందిన వలంటీర్లు తొలుత సచివాలయం ముందు ఆందోళన చేశారు. పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. వలంటీర్లు లావణ్య, దుర్గ, కుమారి, వినయ్, ప్రశాంతి, నాగమణి, ఆదిశేషు, తేజ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



విశ్వనాథపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ మేలు జరుగుతోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. విశ్వనాథపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరం గురువారం నిర్వహించారు. 546 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానానికి సంబంధించిన కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్న అర్హులతో పాటు ఇంకా లబ్ధి పొందనివారి సమస్యలను తక్షణమే పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. డీఎఫ్ఓ, మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్, ఎంపీడీఓ పాండురంగారావు, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకటనారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హుల సంక్షేమం కోసమే ..

కోనేరుసెంటర్: అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని బందరు తహసీల్దార్ ఎం. శ్రీవిద్య అన్నారు. ఎస్ గొల్లపాలెం, తాళ్లపాలెం -2 గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఎస్ గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో శ్రీవిద్య, తాళ్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణయ్య మాట్లాడారు. ఎస్ గొల్లపాలెంలో 172 మందికి, తాళ్లపాలెంలో 191 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ గొల్లపాలెం సర్పంచ్ బండి దయానందం తదితరులు పాల్గొన్నారు.


పెడన: కొంకేపూడి గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీపీ రాజులపాటి వాణి పాల్గొన్నారు. లబ్ధిదారులకు 183 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచు దావు భైరవలింగం, ఎంపీడీఓ వి రెడ్డయ్య పాల్గొన్నారు.

కార్తికేయ.. కరుణాకర..



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సింహాద్రి

మోపిదేవి: హేస్వామి నాథ కరుణాకర దీనబంధో అంటూ భక్తులు కార్తికేయుడిని కనులారా దర్శించుకుని.. మనసారా ప్రార్థించారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యాన ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం 7 గంటలకు తీర్థపు బిందె, ధ్వజ స్తంభ పూజ, నందీశ్వర పూజతో కార్యక్రమం ప్రారంభించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్వామివారి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు శ్రీనివాస్, భీమేశ్వర రవికుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ వల్లీ దేవసేన అమ్మవార్లను పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. 10 గంటలకు విఘ్నేశ్వర పూజ, 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, చతుర్వేద పండితులు, 11 మంది రుత్వికులతో మహన్యాస పారాయణం, స్వామివారికి పంచామృతాలతో వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లకు ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం లక్షబిల్వార్చన, పుష్పార్చన, రుద్రహోమం, సాయంత్రం 5 గంటలకు వైభవంగా స్వామివార్ల శాంతి కల్యాణం, మహానివేదన, 6.30 గంటలకు పంచహారతులు, చతుర్వేద స్వస్తి తీర్థప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయండి

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ అపరాజిత సింగ్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రీ–సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రాజా బాబు అధికారులను ఆదేశించారు. గురువారం సెక్రటేరియట్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ సాయిప్రసాద్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థజైన్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ రాజాబాబు ఆయన చాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పురోగతిని అధికారులకు వివరించారు. నిర్ణీత సమయంలో లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా మొదటి దశలో 103 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. రెండో దశలో 62 గ్రామాల్లో రీ సర్వే చేపట్టగా గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. 23 గ్రామాల్లో గ్రౌండ్ వాలిడేషన్ పురోగతిలో ఉందన్నారు. 14 గ్రామాలకు డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ పని పూర్తి చేశామని చెప్పారు. 25 గ్రామాలకు 13వ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, సర్వే ఏడీ జి. రంగారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో పలువురికి సీట్లు

కోడూరు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మండలంలోని స్వతంత్రపురం చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన జరుగు జగదీష్ (నూజివీడు ట్రిపుల్ ఐటీ), ఆళ్లమూడి సరయు (నూజివీడు), ఈర్ల ధనశేఖర్ (ఒంగోలు), నాగిడి మనస్విని (శ్రీకాకుళం), పులి నవ్యశ్రీ (శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కించుకున్నారు. సీట్లు సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంఈఓ టీవీఎం రామదాసు, పాఠశాల హెచ్ఎం ఆలా వెంకట రమణ అభినందించారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. చల్లపల్లి గ్రామానికి చెందిన షేక్ షాహెదుల్లా ఖాన్ చల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. కొత్తమాజేరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తెనాలి జెస్సికా నూజివీడు ట్రిపుల్ ఐటీలో, చల్లపల్లి విజయా హైస్కూల్ విద్యార్థి షేక్ బైలూన్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు.

నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు పొందిన ఇరువురు బాలికలు మేళ్లచెరువు వైష్ణవి (అవనిగడ్డ), బోరుగడ్డ లక్ష్మి (బోడవరం) ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

కృత్తివెన్ను: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన మండలంలోని ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పోడు హైస్కూల్ నుండి బొర్రా మహాలక్ష్మి నూజివీడు, చినగొల్లపాలెం హైస్కూల్ విద్యార్థి కూనసాని వికాస్ ఒంగోలు, సంగమూడి హైస్కూల్‌కు చెందిన పుప్పాల లీలా నాగఫణిసాయి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. విద్యార్థులను పలువురు అభినందించారు.



దివిసీమలో కుండపోత వర్షం



బందరులో జలమయమైన ప్రధాన రహదారి

కోడూరు: దివిసీమలో గురువారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. ఉదయం ఐదు నుంచి 8 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాగాయలంక మండలంలో అత్యధికంగా 135.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. కోడూరులో 96.8ఎంఎం, చల్లపల్లిలో 88.6 ఎంఎం, అవనిగడ్డలో 83.6ఎంఎం, మోపిదేవిలో 76.4ఎంఎం, ఘంటసాలలో 35.2 ఎంఎం వర్షపాతం నమోదైయింది. ఈదురుగాలుల ప్రభావంతో మండలంలోని కోడూరు–ఇరాలి గ్రామ రహదారిలో ద్వారకా సమీపంలో చెట్లు నేలవాలాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించారు. పల్లపు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి.

పెడనలో..

పెడన: పెడన పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం వేకువ జాము రెండు గంటల నుంచి సుమారు ఐదున్నర గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. 133 మిల్లీమీటర్లు (13 సెం.మీ) వర్షపాతం నమోదైంది. పట్టణంలోని ప్రధాన రహదారులు, కచ్చా డ్రైయిన్లు ఏకమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. పంట పొలాల్లో వర్షం నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

బందరులో ఇంటిపై పడిన పిడుగు..

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8 గంటల్లోగా 82.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధాన రహదారులతో పాటు కోనేరు సెంటర్ బస్టాండ్ ఆవరణ పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు నీటితో నిండి కాలువల్లో దర్శనమిచ్చాయి. ప్రధాన రహదారుల్లో వర్షంనీరు మోకాళ్లలోతు పైగా నిలవటంతో రోడ్ల వెంబడి తోపుడుబండ్ల వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. బందరుకోటలోని 21వ డివిజన్ కార్పొరేటర్ మన్నే శారద ఇల్లు పిడుగుపాటుకు గురైంది. ఉదయం 6.10 గంటల సమయంలో ఉరుములు వచ్చిన సమయంలో పిడుగు వీరి ఇంటిపై పడటంతో ఇంటిపై ఉన్న పిట్టగోడలు బీటలు వారాయి. రాళ్ల ముక్కలు ఎగిరిపడ్డాయి. ఆ సమయంలో పెద్దపెట్టున శబ్దం రావడంతో ఆ ప్రాంత వాసులు భయాందోళనకు గురయ్యారు.

గూడూరులో..

గూడూరు: గూడూరు మండలంలో తెల్లవారు జాము నుంచి ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. గ్రామాల్లో ప్రధాన వీధులలో నీరు నిలిచింది. గూడూరు ప్రధాన కూడలిలో మోకాలి లోతులో నీరు నిలిచింది. పంచాయతీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన నీరు పోయేందుకు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రాంతంలో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. పొలాల్లో నీరు చేరడంతో చెరువులను తలపించాయి.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, లేకుంటే అర్హుల జాబితా నుండి వారి పేర్లు తొలగించి అవసరం ఉన్న వేరొకరికి కేటాయింపులు చేయాల్సి వస్తుందని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఏఓ జెస్సీ, సీడీపీఓ సముద్రవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మనోజ్, ఎంఈఓ–2 ప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ ఎక్స్‌టర్ కారు



మచిలీపట్నంటౌన్: నగరంలోని హ్యుందాయ్ షోరూమ్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్ కారును గురువారం జిల్లా రవాణాధికారి పి. సీతాపతిరావు లాంఛనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా హ్యుందాయ్ కంపెనీ పలు సదుపాయాలతో కార్లను విడుదల చేస్తోందన్నారు. షోరూమ్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ అందుబాటు ధరతోపాటు ఎన్నో ఫీచర్లు పొందుపరిచారని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామారావు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సాయి, క్రాంతి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.